సాక్షి రంగారెడ్డి

శనివారం ၊ 18 ၊ ఫిబ్రవరి ၊ 2023

20న ఖేలో తెలంగాణ.. జీతో తెలంగాణ క్రీడలు

సాక్షి, సిటీబ్యూరో: ఈనెల 20న నగరంలోని నిజాం కళాశాల మైదానంలో ఏబీవీ ఫౌండేషన్ సౌజన్యంతో 'ఖేలో తెలంగాణ..జీతో తెలంగాణ' పేరుతో నిర్వహించనున్న క్రీడా పోటీలను కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ నెల 21 నుంచి 26 వరకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలను నిర్వహించనున్నారు.

నేటి రాత్రి ఫ్లైఓవర్లు బంద్

సాక్షి, సిటీబ్యూరో: మహా శివరాత్రి, జగ్‌నేకీ రాత్ నేపథ్యంలో శనివారం రాత్రి నగరంలోని అన్ని ఫ్లైఓవర్లను మూసివేయనున్నట్లు ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్‌బాబు శుక్రవారం ప్రకటించారు. ప్రత్యామ్నాయ మార్గాలు లేని గ్రీన్‌ల్యాండ్స్ ఫ్లైఓవర్, లంగర్‌హౌస్ ఫ్లైఓవర్లతో పాటు పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే తప్ప మిలిగినవి శనివారం రాత్రి 10 గంటల నుంచి ఆదివారం ఉదయం వరకు మూసి ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం 200 బస్సులు ప్రత్యేకంగా నడిపేందుకు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఏర్పాట్లు చేసింది. సికింద్రాబాద్, రెజిమెంటల్‌బజార్, అమ్ముగూడ, యాప్రాల్, ఈసీఐఎల్, అఫ్జల్‌గంజ్, కేపీహెచ్‌బీ, ఉప్పల్ నుంచి కీసరకు బస్సులు నడవనున్నాయి. పటాన్‌చెరు, ఎంజీబీఎస్ నుంచి బీరంగూడ, ఏడుపాయల జాతరకు సిటీ బస్సులు అందుబాటులో ఉంటాయి.

న్యూస్‌రీల్

కంటి వెలుగుపై విస్తృత ప్రచారం కల్పించండి

డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు



కంటి వెలుగు పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు

షాబాద్: క్యాంపులకు ఎక్కువ మంది హాజరయ్యేలా క్షేత్రస్థాయి సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కంటి వెలుగుపై విస్తృత ప్రచారం కల్పించాలని డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. మండల పరిధిలోని కేసారంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు శిబిరానికి తరలివచ్చేలా ఆశ, ఆరోగ్య కార్యకర్తలు ప్రోత్సహించాలన్నారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారి వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులతో మాట్లాడిన అధికారులు నిర్వహణపై ఆరా తీశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పదమ్మ, గోపాల్‌రెడ్డి, మహమూద్, బలరాం, గోపాల్, రమేష్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు ఠాణాను సందర్శించిన డీసీపీ



స్టేషన్ ఆవరణను పరిశీలిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

ఆమనగల్లు: పట్టణంలోని పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాలను శుక్రవారం శంషాబాద్ డీసీపీ సి.నారాయణరెడ్డి సందర్శించారు. పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాలను తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ ఆవరణను పరిశీలించారు. స్టేషన్ ఎదుట ఉన్న దివంగత ఎస్‌ఐ హన్మంతరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సీఐ ఉపేందర్, ఎస్‌ఐ సుందరయ్యతో సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఇబ్బందులు లేకుండా చూడాలని వారికి సూచించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తుక్కుగూడ: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఆశ్రమ ఉన్నత పాఠశాల బోయినపల్లిలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ అకాడమీలో గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్పోర్ట్స్ శిక్షణ కేంద్రంలో 5వ తరగతి బాలబాలికలకు ప్రవేశం ఉంటుందన్నారు. 4వ తరగతి ఉత్తీర్ణులై, ఆసక్తి గల విద్యార్థులు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, బోనఫైడ్, ఆధార్ జిరాక్స్‌ను కలెక్టర్ కార్యాలయంలోని గిరిజన అభివృద్ధి కార్యాలయంలో ఈ నెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 88852 01009, 99890 23016 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సండే ఫన్‌డే మళ్లీ వచ్చింది..

సాక్షి, సిటీబ్యూరో: ఆదివారం సందడి మళ్లీ వచ్చేసింది. నగరవాసులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచే సండే ఫన్‌డే కార్యక్రమానికి హెచ్‌ఎండీఏ తిరిగి శ్రీకారం చుట్టింది. ఈ నెల 19వ తేదీ ఆదివారం ట్యాంక్‌బండ్‌పై ఈ సండే ఫన్‌డే నిర్వహించనున్నారు. తెలంగాణ సంస్కృతి, కళలు, ఆట, పాటలతో ట్యాంక్‌బండ్‌పై ఉత్సవ వాతావరణం నెలకొననుంది. మరోవైపు కొత్తగా ప్రారంభించిన మ్యూజికల్ వాటర్ ఫౌంటెన్ సందర్శకులకు కనువిందు చేయనుంది. ఒకవైపు నింగిలోకి ఎగిసే రంగురంగుల జలపాతాలు, మరోవైపు నేపథ్యంగా వినియోగించే చక్కటి సంగీతం నగరవాసులకు అద్భుతమైన అనుభూతినివ్వనున్నాయి. ఈసారి కొత్తగా ప్రవేశపెట్టిన డబుల్ డెక్కర్ బస్సులు కూడా ట్యాంక్‌బండ్‌పైన మరో ప్రత్యేకమైన ఆకర్షణగా కనిపిస్తాయి. అలాగే తుది మెరుగులు దిద్దుకుంటున్న తెలంగాణ అమరవీరుల స్మారకం, రాష్ట్ర సచివాలయం కూడా సందర్శకులను ఆకట్టుకోనున్నాయి. వారం పాటు వివిధ రకాల ఒత్తిళ్ల మధ్య గడిపే నగరవాసులకు ఆహ్లాదభరితమైన వాతావరణాన్ని అందజేసేవిధంగా సండే ఫన్‌డే నిర్వహించనున్నట్లు హెచ్‌ఎండీఏ కమిషనర్ అరవింద్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం నుంచి ట్యాంక్‌బండ్ మీదుగా వాహనాల రాకపోకలను నిలిపివేయనున్నారు.

విద్యుత్ వెలుగుల్లో మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయం



శివ పూజకు వేళాయె..

మహాశివరాత్రి వేడుకలకు జిల్లాలోని శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. రంగురంగుల విద్యుత్ దీపాలు, తోరణాలతో సుందరంగా అలంకరించారు. శనివారం వేకువ జామునుంచే ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం నుంచే భక్తులు క్యూ కట్టనున్న నేపథ్యంలో నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. మరోవైపు శుక్రవారం పండ్ల మార్కెట్లు కిటకిటలాడాయి.

దేశానికే రోల్ మోడల్ తెలంగాణ

జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి

షాబాద్: తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో దేశానికే రోల్ మోడల్‌గా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. గిఫ్ట్ ఏ స్మైల్ కింద దివ్యాంగులకు ట్రై స్కూటీలు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీచైర్‌పర్సన్, ఎంపీ మాట్లాడుతూ.. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా రైతులకు తాగు, సాగునీరు అందించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు అందజేస్తామన్నారు. ఇంటి స్థలం ఉన్న ప్రతి ఒక్కరికీ నిర్మాణం కోసం రూ.3లక్షలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, ఇతర రాష్ట్రాలు మనవైపు చూస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్,



రక్తదానం చేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

కొలన్ ప్రభాకర్‌రెడ్డి, టీఎల్‌ఎఫ్ జిల్లా లీగల్ అడ్వయిజర్ పీసరి సతీష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు రాజేందర్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి, సుధాకర్‌యాదవ్, రవియాదవ్, మొయినాబాద్, చేవెళ్ల బీఆర్‌ఎస్ మండలాల అధ్యక్షులు ప్రభాకర్, మహేందర్‌రెడ్డి, ముఖ్రంఖాన్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

భూముల లెక్క.. ఇక పక్కా



- తేల్చాలని రెవెన్యూ యంత్రాంగానికి ప్రభుత్వం ఆదేశం
- వివరాల సేకరణలో అధికారులు తలమునకలు
- ప్రభుత్వ, అసైన్డ్‌తో పాటు గ్రామాల వారీగా 12 రకాల భూముల గుర్తింపు
- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదిక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గ్రామాల వారీగా ప్రభుత్వ భూముల లెక్కలు తేల్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. పంచాయతీ, మండలం, మున్సిపాలిటీల పరిధిలో ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఎన్ని ఉన్నాయి.. ఇప్పటి వరకు ఎంత ఆక్రమణకు గురైంది.. ప్రస్తుతం ఎంత మిగిలింది.. స్థలాలు ఖాళీగా ఉన్నాయా.. ఏమైనా నిర్మాణాలు వెలిశాయా.. వంటి అంశాలపై లెక్క తీస్తోంది. రెవెన్యూ యంత్రాంగం నియోజకవర్గాలవారీగా మంగళవారం నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి అందజేసింది. గుర్తించిన ఈ భూములను హెచ్‌ఎండీఏకి అప్పగించి బహిరంగ మార్కెట్లో అమ్మి ఆర్థికంగా సొమ్ము చేసుకుంటుందా లేక ఇళ్లు లేని నిరుపేదలకు పేదలకు స్థలాలు కేటాయిస్తుందా అనేది తేల్చాల్సి ఉంది.

పంచేస్తారా.. పక్కాగా రక్షిస్తారా?

ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్, సీలింగ్ భూములకు కనీస రక్షణ లేకపోవడంతో ఇప్పటికే చాలా వరకు అన్యాక్రాంతం అయ్యాయి. గ్రామ కంఠం భూములు సైతం కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లాయి. ఇప్పటికే వీరంతా జీవో నంబర్ 58, 59 కింద దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రక్రియ ఒకవైపు కొనసాగుతుండగానే.. మరోవైపు పంచాయతీల వారీగా ప్రభుత్వ భూముల గుర్తింపు అంశాన్ని తెరపైకి తీసుకురావడం చర్చనీయాంశంగా మారింది. ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూంలు నిర్మించి ఇస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చింది. చాలాచోట్ల ఇప్పటికీ నిర్మాణాలతో పాటు పంపిణీ పూర్తి కాలేదు. దీంతో పలువురు నిరుపేదలు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఇప్పటికే అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, కందుకూరు, చేవెళ్ల, మొయినాబాద్ మండలాల్లోని ప్రభుత్వ, భూదాన్ భూముల్లో గుడిసెలు వేశారు. ఇళ్లు, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఒత్తిడి వస్తుండటంతో ప్రభుత్వం ఈ ఖాళీ భూములపై దృష్టి సారించినట్లు తెలిసింది. గ్రామాలు, మున్సిపాలిటీలు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈ భూములను గుర్తించి, వీకర్స్ సెక్షన్ కింద ఆయా వర్గాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఎన్నికల్లో లబ్ధిపొందొచ్చనే భావన కూడా ప్రభుత్వ వర్గంలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

నివేదికలు సిద్ధం చేసిన అధికారులు

జిల్లాలో సుమారు 13,19,308 ఎకరాాల భూములు ఉండగా, దీనిలో 2,50,107 ఎకరాలు సాగుకు యోగ్యం లేని కొండలు, గుట్టలతో కూడినవి ఉన్నాయి. 1,64,989 ఎకరాల ప్రభుత్వ భూములు ఉండగా, 90,911 ఎకరాలు అసైన్డ్ భూములు ఉన్నాయి. 26 మండలాల్లో 321 పంచాయతీల పరిధిలో 6,471.03 ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నట్లు గుర్తించి, దీనిలో 5,440 మంది పేదలకు 6,198.11 ఎకరాలు అసైన్ చేసింది. దీనిలో 12 రకాల భూములను 24 గంటల్లోగా గుర్తించి, నివేదికలు పంపాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములతోపాటు ఇప్పటి వరకు వివిధ సంక్షేమ శాఖలకు కేటాయించిన భూములు, శిఖం భూములు, వక్ఫ్ భూములు, దేవాదాయ ధర్మాదాయశాఖ భూములు, సీలింగ్ భూములు, గ్రామ కంఠం భూములు, ఇతర ప్రభుత్వ శాఖల భూములు, ప్రభుత్వం లీజుకు ఇచ్చిన భూములు, నోటరీ పట్టా భూములు, సాదాబైనమా పట్టా భూములు, ఇతర భూముల వివరాలను గ్రామాలు, మున్సిపాలిటీలు, నియోజకవర్గాల వారీగా గుర్తించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు ఈ మేరకు నివేదికలు సిద్ధం చేశారు.

వీరికి రూ.3 లక్షలు.. వారికి ఖాళీ జాగలు

ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత 2014 నుంచి ఇప్పటి వరకు తెలంగాణ వ్యాప్తంగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదు. తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సొంత స్థలం ఉన్న వారికి రూ.మూడు లక్షలు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. స్థలం లేని వారి పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం సేకరించిన ఈ భూముల్లో వారికి వీకర్స్ సెక్షన్ కింద ఇళ్ల పట్టాలు ఇచ్చి, నిర్మాణానికి రూ.3 లక్షలు ఆర్థిక సహాయం చేయాలనే యోచనలో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ నిర్ణయంతో పేదలకు న్యాయం చేయడంతో పాటు ఎన్నికల్లో లబ్ధిపొందొచ్చని భావిస్తోంది.

'పీఠం'ముడి.. ఎప్పుడో వీడేది?



సమావేశమైన కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు

- తుర్కయంజాల్‌లో ఆసక్తికరంగా మారిన చైర్‌పర్సన్ అంశం
- ఒప్పందం ముగిసి ఆరు నెలలైనా కొలిక్కిరాని పదవీ బదిలీ
- తాజాగా మరోసారి సమావేశమైన కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు
- ఎటూ తేలని వైనం

తుర్కయంజాల్: ఒప్పందం ప్రకారం మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని బదిలీ చేసుకోవాల్సిందేనని డిమాండ్ చేస్తూ శుక్రవారం తుర్కయంజాల్‌లోని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్స్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన 15 మంది కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు సమావేశం కావడం సర్వత్రా చర్చనీయాంశం అయింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పదవీ ప్రమాణస్వీకార సమయంలో మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సోదరుడి సతీమణి మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి, మాజీ ఎంపీపీ రొక్కం భీంరెడ్డి కోడలు అనితా చంద్రశేఖర్ రెడ్డి మధ్య భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో జనవరి 2020లో ఒప్పందం జరిగిన విషయం తెలిసిందే. 2022 జూలైతోనే గడువు ముగిసినప్పటికీ పలు కారణాలతో ఆరు నెలలపాటు వాయిదా వేశారు. ఇచ్చిన గడువు ముగిసినా పదవీ పంపకం వ్యవహారం కొలిక్కి రాకపోవడం ఆసక్తికరంగా మారింది.

పలుమార్లు సమావేశమైనా..

చైర్‌పర్సన్ పదవి బదిలీ విషయమై ఇప్పటికి ఎన్నోసార్లు సమావేశమైనా ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. పదవి బదిలీకి తాము ఒప్పుకొంటున్నామని మల్‌రెడ్డి సోదరులు చెబుతున్నా నేతలంతా కలిసి సమావేశమైన చోటుకు రాకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి తయారైంది. తాజాగా శుక్రవారం కొన్ని గంటల పాటు చర్చ జరగ్గా.. త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుందామని చెప్పినట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే పిలిచినా..

ఇటీవల తొర్రూర్‌లో మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, ముఖ్య నాయకులతో పురపాలక సంఘం పరిధిలో హాత్ సే హాత్ జోడో యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సమావేశం నిర్వహించినా రొక్కం అనితా చంద్రశేఖర్ రెడ్డి వర్గానికి చెందిన పలువురు కౌన్సిలర్లు గైర్హాజరయ్యారని సమాచారం. ఒప్పందం ప్రకారం చైర్మన్ పదవి ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారనే కారణంతో పార్టీ కార్యక్రమాలతో పాటు, కౌన్సిల్ సమావేశాలకు కూడా హాజరు కావద్దని భావిస్తున్నట్లు ఆ పార్టీకి చెందిన నేతలే నేరుగా చెబుతున్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

- పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

కడ్తాల్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో పీఆర్‌టీయూ టీఎస్ నిరంతరం కృషి చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. పీఆర్‌టీయూ టీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మద్దతుగా శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర, బాలిక ఉన్నత పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సామాల మహేందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాధాకృష్ణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పద్మావతితో కలిసి ఆయన మాట్లాడారు. పీఈటీ, పండిట్ పదోన్నతులు ఏప్రిల్‌లోపు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. జీవో 317తో ఇతర జిల్లాలకు కేటాయించిన ఉపాధ్యాయులను తిరిగి వారి సొంత జిల్లాలకు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. 30 శాతం పీఆర్‌సీ, ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ ఇప్పించిన ఘనత పీఆర్‌టీయూదేనన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం కృషి చేస్తున్న పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలనుపురస్కరించుకుని బాలుర ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నరోత్తంరెడ్డి, శ్రీనివాస్‌చారి, భగవాన్‌రెడ్డి, అరవింద్, రాజేశ్వర్‌రెడ్డి, మధుకర్, సుదర్శన్, కిష్టారెడ్డి, సుగుణ, అశోక్‌రెడ్డి, కిశోర్, ధనంజయ్‌గౌడ్, రాధాకృష్ణరెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

చిత్తశుద్ధిని నిరూపించుకోండి

- ఢిల్లీలో బంజారా భవన్ నిర్మించండి
- బంజారాల సంక్షేమం కోసం బీజేపీ, కాంగ్రెస్ చేసిందేమీ లేదు
- తెలంగాణ వచ్చాకే అభివృద్ధి
- కేసీఆర్ చొరవతో ప్రత్యేక కార్యక్రమాలు
- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్



బంజార వేషధారణలో మంత్రులు సబితారెడ్డి, సత్యవతి రాథోడ్

మహేశ్వరం: బీజేపీకి బంజార జాతిపై ప్రేముంటే దేశ రాజధాని ఢిల్లీలో బంజార భవన్ నిర్మించాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలోని గడికోటలో శుక్రవారం గోర్ బంజార ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ 284వ జయంతి ఉత్సవాల్లో విద్యాశాఖ మంత్రి సబితారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బంజారాలను రాజకీయ లబ్ధికోసం వాడుకోవడం తప్ప వారి సంక్షేమం కోసం చేసిందేమీ లేదన్నారు. సీఎం కేసీఆర్‌కు బంజారాలపై అపారమైన గౌరవం ఉందని, సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రూ.100 కోట్లతో హైదరాబాద్ నడిబొడ్డున బంజార గిరిజన భవన్ నిర్మాణం చేపట్టినట్టు గుర్తు చేశారు. 500 జనాభా కలిగిన ప్రతి తండాను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేసి నూతన భవనాలను మంజూరు చేయడంతో పాటు మిషన్ భగీరథ కింద ఇంటింటికీ నల్లా కనెక్షన్, బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం చేసిన మహానుభావుడు కేసీఆర్ అని కొనియాడారు. గతంలో రాష్ట్రంలో 273 గురుకులాలు ఉండేవని తెలంగాణ రాష్ట్రం వచ్చాక సీఎం ప్రత్యేక చొరవతో ప్రస్తుతం 1,005 గురుకులాలు ఏర్పడ్డాయన్నారు.

సంత్ సేవాలాల్ స్ఫూర్తితో ముందుకు..

సంత్ సేవాలాల్ మహరాజ్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని మంత్రి సబితారెడ్డి అన్నారు. సేవాలాల్ మహరాజ్ జీవిత చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాలని, ఆయన చూపిన అడుగుజాడల్లో పయనించాలన్నారు. ప్రభుత్వం గిరిజన, బంజారాల అబివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందన్నారు. అనంతరం మంత్రులు గిరిజన విద్యార్థులతో కలిసి నృత్యం చేశారు. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ చైర్మన్ వాల్యా నాయక్, మాజీ ఎంపీ సీతారాం నాయక్, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ట్రికార్ చైర్మన్ రామచంద్రు నాయక్, తెలంగాణ గిరిజన ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రు నాయక్, ఎంపీపీ కొరుపోలు రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునితా నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి గౌడ్, మహేశ్వరం గిరిజన బంజార ఉపాధ్యాయులు, నిర్వాహకులు అంగుర్ నాయక్, జానకిరాం, రఘు నాయక్, సూర్య నాయక్, అంధ్యా నాయక్, సర్పంచ్‌లు మోతిలాల్, రాజు నాయక్, శివి నాయక్, కౌన్సిలర్ రవి నాయక్, డైరెక్టర్ రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

భయం వద్దు.. ఆత్మవిశ్వాసమే ముద్దు

- సమయం వృథా చేయవద్దు
- పరీక్షలను పండుగలా జరుపుకోవాలి
- సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న జేడీ లక్ష్మీనారాయణ

షాద్‌నగర్: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధిస్తామని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని ఠాగూర్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో సత్యశ్రీ ఫౌండేషన్, ట్రస్మా వారి ఆధ్వర్యంలో పదో తరగతి వార్షిక పరీక్షలు రాయనున్న విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడారు. క్రమ శిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే విజయాలు సొంతం అవుతాయన్నారు. పరీక్షలు అంటే భయపడొద్దని అన్నారు. పరీక్షలను పండుగలా జరుపుకోవాలని అన్నారు. పండుగ వాతావరణంలో పరీక్షలు రాయాలని అన్నారు. తాము ఎక్కడ పుట్టామనేది ముఖ్యం కాదని, ఎలా పెరిగాం, ఎక్కడికి చేరాం, ఏ స్థానంలో ఉన్నామనేదే ముఖ్యమన్నారు. విద్యార్థులు లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమిస్తేనే అనుకున్న లక్ష్యాలను చేరుకోగలుగుతారని అన్నారు. అదేవిధంగా విద్యార్థులు విద్యతో పాటు వినయం, చదువుతో పాటు సంస్కారం నేర్చుకొని తల్లిదండ్రులను, పెద్దలను, ఉపాధ్యాయులను గౌరవించాలని అన్నారు. పరీక్షలకు సమయం దగ్గర పడటంతో సమయాన్ని వృథా చేయవద్దని, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రణాళికబద్ధంగా చదివితే విజయాలను సొంతం చేసుకోవచ్చని అన్నారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యశ్రీ ఫౌండేషన్ చైర్మెన్ శ్రీవర్ధన్‌రెడ్డి, కరస్పాండెంట్ రాజేంద్రప్రసాద్, డీవీఎస్ స్వామి, రమణారెడ్డి, వంశీకృష్ణ, రవి ప్రకాష్ హర్మాక్ పాల్గొన్నారు.

చిరువ్యాపారుల తొలగింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు

కొత్తూరు: మండలంలోని జేపీదర్గా ఆవరణలో చిరు దుకాణాలను తొలగించిన వ్యవహారంపై శుక్రవారం సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యుడు పర్వతాలు కలెక్టర్ హరీష్‌కు ఫిర్యాదు చేశారు. రోడ్డు విస్తరణకు ఎలాంటి అనుమతులు లేనప్పటికీ సమీపంలోని స్టోన్‌క్రషింగ్ నిర్వాహకులు కొందరితో కుమ్మక్కై చిరు వ్యాపారులకు తీరని నష్టం చేసినట్లు కలెక్టర్‌కు వివరించారు. క్రషర్ నిర్వాహకుల కారణంగా చిరు వ్యాపారులకు జీవనోపాధి కరువైందని పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

ఒకరి మృతి, మరొకరికి గాయాలు


గౌస్‌పాషా (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: అతి వేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామానికి చెందిన మహ్మద్‌గౌస్ (44), షేక్ ఇస్మాయిల్ గురువారం రాత్రి 7.30గంటల సమయంలో బాటసింగారం వైపు నుంచి అబ్దుల్లాపూర్ గ్రామానికి వెళుతున్నారు. పోలీస్‌స్టేషన్ సమీపంలో యూ టర్న్ తీసుకుంటుండగా అదే సమయంలో హైదరాబాద్ వైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో గౌస్‌తో పాటు ఇస్మాయిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆసుపత్రికి తరలించగా గౌస్ మృతిచెందగా, ఇస్మాయిల్ చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.


గౌతం జూనియర్ కాలేజీ జట్టు


ఎంవీఎస్ గవర్నమెంట్ ఆర్ట్స్, సైన్స్ కాలేజీ జట్టు

హోరా హోరీగా ఫైనల్స్

- 'సాక్షి' ప్రీమియర్ లీగ్ రీజినల్ విన్నర్‌గా భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజీ సైనిక్‌పురి జట్టు
- జూనియర్ విజేతగా గౌతం జూనియర్ కాలేజీ ఈసీఐఎల్


భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజీ జట్టుకు కప్ అందజేస్తున్న 'సాక్షి'ఈవెంట్స్ ఏజీఎం ఉగ్రగిరిరావు

ఘట్‌కేసర్: మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా, ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్ క్రికెట్ మైదానంలో 'సాక్షి' మీడియా గ్రూపు ఆధర్వంలో నిర్వహిస్తున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్ మహబూబ్‌నగర్, గ్రేటర్ హైదరాబాద్ రీజినల్ సీనియర్, జూనియర్ ఫైనల్ మ్యాచ్‌లు శుక్రవారం హోరాహోరీగా జరిగాయి.

సీనియర్ విభాగంలో ఎంవీఎస్ గవర్నమెంట్ ఆర్ట్స్, సైన్స్ కాలేజీ మహబూబ్‌నగర్, భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజీ సైనిక్‌పురి జట్లు రీజినల్ లెవల్‌లో తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఎంవీఎస్ గవర్నమెంట్ ఆర్ట్స్, సైన్స్ కాలేజీ జట్టు 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేసింది. డేవిడ్ 29 బంతుల్లో 56 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన భవాన్స్ డిగ్రీ కాలేజ్ జట్టు 8.3 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 105 పరుగులు చేసి మహబూబ్‌నగర్, గ్రేటర్ హైదరాబాద్ రిజినల్ సీనియర్ విభాగంలో విజేతగా నిలిచింది. జట్టులో నితీశ్ 32 బంతుల్లో 72 పరుగులు చేసి విజయంలో కీలక పాత్ర పోషించాడు.

జూనియర్ విభాగంలో గవర్నమెంట్ జూనియర్ కాలేజీ (బాలుర) మహబూబ్‌నగర్, గౌతం జూనియర్ కాలేజ్ ఈసీఐఎల్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన గవర్నమెంట్ జూనియర్ కాలేజీ జట్టు 9 ఓవర్లతో 10 వికెట్లు కోల్పోయి 62 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గౌతం జూనియర్ కాలేజ్ ఈసీఐఎల్ జట్టు 5.4 ఓవర్లతో 3 వికెట్లు కోల్పోయి 64 పరుగులు చేసి మహబూగర్‌నగర్, గ్రేటర్ హైదరాబాద్ రీజినల్ జూనియర్ విన్నర్స్‌గా నిలిచారు. గౌతం క్రీడాకారుడు మనీశ్ 3 వికెట్లు తీయగా, అసిలేశ్ 7 బంతుల్లో 19 పరుగులు, అన్విత్ 10 బంతుల్లో 18 పరుగులు చేశారు. రీజినల్ విన్నర్స్, రన్నర్స్, గ్రేటర్ హైదరాబాద్ జిల్లా విజేతలకు ఈవెంట్స్ ఏజీఎం ఉగ్రగిరిరావు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు.

గండిపేట వరకు రోడ్డు నిర్మించరూ..

మంత్రి హరీశ్‌రావును కలిసిన నాయకులు


మంత్రి హరీష్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ పంచాయతీ కార్యాలయం నుంచి గండిపేట వరకు రోడ్డు నిర్మాణానికి కృషి చేయాలని పంచాయతీ పాలక వర్గం సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి హరీశ్‌రావును నగరంలోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేసుకున్నప్పుడే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని అన్నారు. మంత్రిని కలిసిన వారిలో గ్రామ సర్పంచ్ మంజులరవియాదవ్, ఉపసర్పంచ్ శ్యామ్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్నసతీష్, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముదిగొండ రవి యాదవ్ ఉన్నారు.

ప్రశ్నించే గొంతుకను గెలిపిద్దాం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాణిక్‌రెడ్డికి ఓటేద్దాం

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శాంతివేద్య


తాళ్లపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న శాంతి వేద్య, కల్పన, శివారెడ్డి తదితరులు

షాబాద్: మండలిలో ప్రశ్నించే గొంతుకను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శాంతివేద్య అన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి టీఎస్‌యూటీఎఫ్ ఎంతో కృషి చేస్తున్నదని అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సర్దార్‌నగర్, షాబాద్, తాళ్లపల్లి, రేగడిదోస్వాడ, హైతాబాద్, పోతుగల్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య, ఉపాధ్యాయుల సమస్యల సాధనకు యూటీఎఫ్ నిరంతరం పోరాడుతోందని చెప్పారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సంఘం బలపరిచిన పాపన్నగారి మాణిక్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రశ్నించే గొంతుక మాణిక్‌రెడ్డిని గెలిపించుకునే ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు కల్పన, జిల్లా కార్యదర్శి శివారెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, ప్రభాకర్, నాయకులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన తప్పనిసరి


ర్యాలీలో పాల్గొన్న సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ నారాయణనాయక్ తదితరులు

వాహనాలను వేగంగా నడపొద్దు

- జీవితాలను నాశనం చేసుకోవద్దు
- సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ నారాయణనాయక్

శంకర్‌పల్లి: వాహనాలు వేగంగా నడిపి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ నారాయణనాయక్ అన్నారు. శుక్రవారం దొంతాన్‌పల్లి శివారులో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని పంపితే.. వారి మాటలను పెడచెవిన పెట్టి మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని అన్నారు. ప్రధానంగా ఇక్ఫాయి కళాశాలలో చదివే విద్యార్థులు క్రమ శిక్షణలో వెనుకంజలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల నడవడికపై యాజమాన్యం దృష్టి సారించాలని అన్నారు. కళాశాల పరిసరాలను స్థానిక పోలీసులు ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. కాగా ట్రాఫిక్ పోలీసులు నిబంధనలపై కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఐపీఎస్ హర్షవర్ధన్, ఏసీపీలు రమణాగౌగ్, హన్మంత్‌రావు, సీఐలు మహేష్‌గౌడ్, వాసు, ఎస్‌ఐలు కృష్ణ, సంతోష్‌రెడ్డి, కళాశాల యాజమాన్యం విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంతో అధిక ఆదాయం

కొత్తూరు: పుట్టగొడుగుల పెంపకంతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ నరేందర్‌రెడ్డి సూచించారు. రాజేంద్రనగర్‌లోని కళాశాల ప్రాంగణంలో శుక్రవారం మండల పరిధిలోని మల్లాపూర్, తీగాపూర్ గ్రామాలకు చెందిన రైతులకు పుట్టగొడుగుల పెంపకంపై అవగాహన కల్పించారు. రైతులు వ్యవసాయంలో లాభాలు వచ్చే పంటలను మాత్రమే సాగుచేయాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సలహాలు పాటించి మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగుచేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఈశ్వరి, ప్రమీల, విద్యాసాగర్, ఏఓ గోపాల్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

విద్య, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

షాబాద్: విద్య, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కన్నయగారి గోవర్ధన్ యాదవ్ అన్నారు. శుక్రవారం షాబాద్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పీఈటీ, పండిత్ పదోన్నతుల ఉన్నతీకరణ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్, కృష్ణ, గౌరవ అధ్యక్షుడు యాదయ్య, రాష్ట్ర బాధ్యులు నర్సింహులు ఉపాధ్యాయులు తదితరులున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

షాబాద్: అనారోగ్యంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ గురువయ్యగౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కుంటకు చెందిన చిర్ర నర్సింహులు (32)పుట్టుకతోనే కంతులు ఉన్నాయి. ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం లేకపోయింది. పైగా కంతులు పెరిగాయి. బాధభరించలేక ఇంట్లో ఎవరూలేని సమయంలో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ వస్తేనే పేదల బాధలు తీరుతాయ్

పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్


మాట్లాడుతున్న వీర్లపల్లి శంకర్

కొందుర్గు: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేదల కష్టాలు తీరుతాయని పార్టీ రాష్ట ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పార్టీ నాయకులు కొందుర్గు మండలంలోని అయోధ్యాపూర్ తండా, పుల్లప్పగూడ, చిన్నఎల్కిచర్ల, శ్రీరంగాపూర్, అయ్యవారిపల్లి, రామచంద్రాపూర్, పులుసుమామిడి, పర్వతాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమానికి వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై ఆయా గ్రామాల ప్రజల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతు కాంగ్రెస్ పాలనలో ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని గుర్తు చేశారు. కేసీఆర్ పాలనలో ఇప్పటి వరకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు. అన్ని గ్రామాల్లో కాంగ్రెస్‌పార్టీకి ఎంతో ఆదరణ ఉందని, కాంగ్రెస్‌కు పూర్వ వైభవం వస్తుందని అన్నారు. కాగా చిన్నల్కిచర్లలో జోగు జంగయ్య భార్య అనారోగ్యంతో మృతిచెందారని, వారికి ఇద్దరు చిన్నారులున్నారని, కనీసం ఉండటానికి ఇల్లు లేని దుస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శంకర్ స్పందిస్తూ జంగయ్య కుటుంబానికి ఇల్లును నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు పురుషోత్తంరెడ్డి, రఘు, బాల్‌రాజ్ గౌడ్, సత్తయ్య, వజ్రమ్మ, జితేందర్ రెడ్డి, మల్లేష్ గౌడ్, చంద్రశేఖర్, మంజుల, నరేందర్, రవీందర్, మైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.